

# కథ

మల్లాది రవిశంకర్

# గోడ కింద పిల్లోడు

'దిస్ పేజ్ కెనాట్ బి డిస్‌ప్లేడ్' అని కంప్యూటర్ స్క్రీన్ మీద రాంగానే మళ్లీ విసుగ్గా రిఫ్రెష్ బటన్ నొక్కాను.

'ఐ.ఐ.టి. జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్' ఫలితాలు ఆ రోజు వస్తాయని ముందుగానే తెలీటంతో ప్రొద్దుట నుండీ ఇంటర్‌నెట్ ఆన్ చేసి ఉంచాను. రిజల్ట్స్ ఎప్పుడయినా అప్‌లోడ్ అవ్వచ్చు.

మా అమ్మాయీ, మేనల్లుడూ ఇద్దరూ ఈ తడవ ఎంట్రెన్స్ రాశారు. మా అమ్మాయి ఎనిమిదో క్లాసులో ఉండంగానే దాన్ని స్పెషల్ క్లాసెస్‌లో చేర్పించాను.

నా చెల్లి కూడా దాని కొడుకుని విజయవాడలో ఒక రూం తీసుకొని, వాడి కోసం ఒక వంటమనిషిని ఏర్పాటు చేసి స్పెషల్ క్లాసెస్‌లో చేర్పించింది. ప్రతి ఆదివారం వాళ్ల ఊరు నుండీ వాడిని చూడటానికెళ్లి, వాడికి కావల్సిన నాలుగూ సమకూర్చి వస్తోంది గత నాలుగేళ్లుగా.

పిల్లల చదువులు కాదు గానీ పెద్దలకి పరీక్షలయిపోయాయి. ఎలాగైనా వాళ్లకి మంచి రాంక్స్ రావాలని మా ఆరాటం. పిల్లలు కూడా పాపం చాలా కష్టపడి చదివారు. ఎంట్రెన్స్ చాలా బాగా రాశాం తప్పక సీటు వస్తుందంటున్నారు.

ఈ టెన్షన్‌తో రాత్రంతా సరిగా నిద్ర పట్టలేదు మాకెవరికీ.

"నాన్నా! ఏ గౌహతీలోనో సీటు వస్తే ఒక్కదాన్నీ ఎలా ఉండాలి? ఆ ఊళ్లో రోజూ ఎక్కడో ఒక చోట బాంబ్ బ్లాస్ట్ అయినట్టు న్యూస్‌పేపర్ నిండా వార్తలే కదా! కేంపస్‌లో ఏ ప్రాబ్లమ్ ఉండకపోవచ్చునుకో" నా కూతురి ప్రశ్న.

దాన్ని మించిన కాన్ఫిడెన్స్‌తో నా మేనల్లుడు.

"నా కేలిబర్‌కీ, నా పెర్‌ఫామెన్స్‌కీ బోంబేలోనే సీట్ రావాలి. అది కాకపోతే మెడ్రాస్ ఐ.ఐ.టి.లో తప్పకుండా ఎలాగో వస్తుందనుకో"

"ముందు రిజల్ట్, ర్యాంక్ చూసుకోండ్రా. ఆ తర్వాత గాలిలో మేడలు కడుదురుగానీ. ఇది ఆలిండియా కాంపిటీషన్. లక్షల మంది తెలివైన విద్యార్థులు రాసిన పరీక్ష. మీ మీద మీకు నమ్మకం ఉండటంలో తప్పు లేదు. కానీ ఇలా ముందే ఇక్కడ సీట్ వస్తుందీ, అక్కడ వస్తుందీ అని ప్లాన్లు వేసుకు కూర్చుని, రిజల్ట్ అటూ ఇటూ అయిందంటే చెప్పలేని నిరుత్సాహం, ఫ్రస్ట్రేషన్ వస్తుంది. అందుకని 'జస్ట్ వెయిట్ అండ్ సీ' అని గట్టిగా మందలించాను.

అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే చాలా మంచిదే. కానీ పరిస్థితి తారుమారయినా, ఏ అఘాయిత్యం చెయ్యకుండా వాళ్లని ప్రిపేర్ చేయాలని నా ప్రయత్నం.

నాలుగేళ్ల నుండీ పాపం తెగ కష్టపడి, పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు వాళ్లు. ఒక సినిమా కానీ, షికారు గానీ లేకుండా రోజుకి ఇరవై గంటలు రుబ్బిందే రుబ్బి పెడుతున్నారు.

వాళ్లని చూసి చాలాసార్లు జాలేసినా, కాంపిటీషన్ అలాంటిది. ఇప్పుడు కష్టపడితే, భవిష్యత్తులో సుఖపడతారని సమాధానపడుతూ వచ్చాను.

వాళ్ల నాలుగేళ్ల కృషికి కొంచెంసేపట్లో తీర్పు రాబోతోంది. రిజల్ట్ ఏదయినా వాస్తవాన్ని అంగీకరించక తప్పదు.

రాత్రంతా వాళ్లతోనే గడిపి "ఇందులో రాకపోతే ఇంకో ఇన్‌స్టిట్యూట్‌లో చేరుదురు కానీ, ఇంజినీరింగ్ కాకపోతే డిగ్రీ చదివి, ఎం.బి.ఏ. చేద్దురుగానీ. ఇదే లైఫ్ అనీ, ఇదే చదువనీ అనుకోవద్దు" అని వాళ్లని ఎటువంటి రిజల్ట్ అయినా ఫేస్ చేసేట్టుగా ప్రిపేర్ చేశాను.

ఇది చాలా అవసరం అనిపించింది. ఎందుకంటే...వాళ్ల మీద ఇప్పటికే చాలా స్ట్రెస్... వత్తిడి. చదివే స్కూల్ వాళ్ల వత్తిడి. వాళ్ల ఎక్స్‌పెక్టేషన్స్. అలాగే తల్లితండ్రుల ఎక్స్‌పెక్టేషన్స్. కనీసం మేము మీతోనే ఉన్నాం. మీ కృషి మీరు చేశారు. ఏ రిజల్ట్ వచ్చినా మేము బాధపడం అనే ఎష్యూరెన్స్ వాళ్లకి ఇవ్వాలని అనిపించటంలో దాదాపు రాత్రంతా వాళ్లతోనే గడిపాను.

చివరికి ఐ.ఐ.టి. రిజల్ట్స్ అప్‌లోడ్ అయ్యాయి. ముందుగా నా మేనల్లుడి నెంబర్ కొట్టాను.

నా కూతురూ, మేనల్లుడూ వంగి కంప్యూటర్ స్క్రీన్ వంక ఆదుర్దాగా చూస్తున్నారు. వాడి మార్క్స్, ర్యాంక్ స్క్రీన్ మీద కనిపించింది.

పదిహేడు వేలల్లో ఉంది వాడి ర్యాంక్.

'షిట్' అంటూ కింద కూలబడిపోయాడు వాడు.

నా కూతురు నెంబర్ కొట్టాను.

ఒక నిమిషం వేచి ఉన్న తర్వాత -

దాని ర్యాంక్ కూడా పదిహేడు వేలల్లో ఉందని తెలిసింది.

అదీ కూలబడింది తెల్ల మొహం వేసుకొని నా వంక చూస్తూ..

నాలుగేళ్ల వాళ్ల కష్టం ఏమీ ఫలించలేదు.

ఈ ర్యాంకులకి గౌహతీలో కాదు కదా మెదక్‌లో కూడా సీటు దొరకదు. 'దొందూ దొందే' అని మనసులో నిరుత్సాహపడి పైకి మాత్రం "పోనీ లేండ్రా మర్చిపోండి. కాసేపు అలా బైటికెడదామ"ని వాళ్లని బయల్దేరతీశాను.

ముగ్గురం బయటికెడుతుండగా 'గోడకింద పిల్లోడు' ఎదురొచ్చాడు. "నువ్వు కూడా మాతో రారా" అని వాడిని కూడా మాతో పాటు ఉన్న పళంగా బయల్దేరతీశాను.

నలుగురం కార్లో కూర్చున్నాం.

సిటీ లిమిట్స్ దాటేదాకా ఎవ్వరం ఏమీ మాట్లాడలేదు.

పిల్లలిద్దరూ మాత్రం మాటిమాటికీ-

"షిట్.. షిట్..." అనుకుంటూ అసహనంగా అరచేతిలో, ఇంకో చేత్తో కొట్టుకుంటున్నారు.

వాళ్లని చూస్తే జాలేసింది. కానీ ఎవరేం చెయ్యగలరు. వాళ్లకి కొంచెం ఊరట కలిగించడానికి చెప్పటం మొదలుపెట్టాను.

"పిల్లలూ! ఐ.ఐ.టి. సీట్ రాలేదని మనసు కష్టపెట్టుకోకండి. మీ ప్రయత్నం మీరు చేశారు. చేసిన ప్రతి మానవ ప్రయత్నం చేసినట్టుగా ఫలిస్తే, మనిషే దేవుడవుతాడు. పైకి రావాలనే కోరికే ఉండాలి కానీ, దారులు

చాలా ఉన్నాయి. మీకు శ్రీనివాస రామానుజం తెలుసు కదా! గ్రేట్ మేథమెటీషియన్. తన గణితశాస్త్ర పరిజ్ఞానంతో యావత్ ప్రపంచాన్నే ఒక ఊపు ఊపాడు. ఆయన 32 ఏళ్లే జీవించినా, ఆయన రిసెర్చ్‌ని ఇప్పటికి కూడా అందరూ గుర్తు చేసుకుంటూనే ఉంటారు. మీకు తెలుసో లేదో ఆయన ఎన్నో పరీక్షల్లో చదువుకొనే రోజుల్లో ఫెయిల్ అయ్యారు. అందుకని ఫెయిల్యూర్స్ ఆర్ స్టెప్పింగ్ స్టోన్స్ టు సక్సెస్" అని వాళ్లకి కొంచెం ఊరట కలిగించాను.

వాళ్లని అలా అలా తిప్పి తీసుకొచ్చేసరికి రాత్రి పది దాటింది.

టెంపరరీగా వాళ్లు బాధని మర్చిపోయారు.

గుడ్‌నైట్ చెప్పి వాళ్ల గదుల్లోకి వెళ్లిపోయారు పడుకోవటానికి.

"నేనూ వెళ్లొస్తాను సార్!" అన్న గోడకింద పిల్లాడిని ఆగమని సైగ చేశాను. నా మేనల్లుడు బయల్దేరిన చాలా సేపటి దాకా ఫ్రస్ట్రేషన్‌లో వుంటే.. 'కూల్ డౌన్ బాబూ' అంటూ మీద చెయ్యేశాడు వీడు.

చేతిని విదిలించి కొట్టి-

'నా బాధ నీకేం తెలుసురా! నోరు మూసుకో ఇడియట్' అని వీడి మీద అరిచాడు.

వ్యూ మిర్రర్‌లో వీడి ముఖం చూశాను.

అవమానాన్నీ, కోపాన్నీ కప్పిపుచ్చుకుని చిరునవ్వు నవ్వాడు. ఆ క్షణం ఆ చిరునవ్వులో నాకు నిండు గోదారి గుర్తొచ్చింది.

వీడి కథ గురించి చెప్పాలంటే-

ఇరవై సంవత్సరాల క్రితం నా కథని గుర్తుచేసుకుంటే సరిపోతుంది.

నేను జీవితంలో చాలా కష్టపడి పైకొచ్చాను.


నా బిజినెస్ చాలా చిన్నగా ఉన్న రోజుల్లో, వీడి నాన్న రిక్షాలో మైక్ పెట్టుకొని నా ప్రొడక్ట్ ఎడ్వర్టయిజ్‌మెంట్ ఇచ్చేవాడు. నా అదృష్టం బాగుందో, వాడి ప్రచారం ఉపయోగపడిందో తెలీదు కానీ..

అంచెలంచెలుగా నేను పైకి ఎదిగాను. బిజినెస్‌లో బాగానే నిలదొక్కుకున్నాను. పదిహేనేళ్ల క్రితం ఈ స్థలం కొని ఇల్లు కడుతుంటే, స్థలానికి కొంచెం కోసు ఉందని గుర్తించాను. ఆ వంకరని బయటికి వదిలేసి స్థలం గోడ కట్టుకుని ఇల్లు కట్టుకున్నాను.

ఆ వంకర స్థలంలో గుడిసె వేసుకుంటానని వీడి తండ్రి అడగటంతో సరేనన్నాను.

దాంతో వీళ్లు మా గోడ కింద గుడిసె వేసుకొని సెటిల్ అయ్యారు.

ఆ తర్వాత వాళ్లకి వీడూ, మాకు మా అమ్మాయీ దాదాపు ఒకేసారి పుట్టారు. చిన్నప్పటి నుండీ వీడిని 'గోడకింద పిల్లోడు' అనే పిలిచేవాళ్లం మేము. వాడు బాగా చదువుతాడని ఓ కార్పొరేట్ కాలేజీ వాళ్లు బాధ్యత తీసుకున్నారని తెలుసు నాకు.



"సార్! ఐ.ఐ.టి. ఎంట్రెన్స్ నేనూ రాస్తున్నాను సార్. ఈ రోజే అప్లికేషన్ పంపిస్తున్నాను. నాకు మీ ఆశీస్సులు కావాలి" అని నా కాళ్లకి దణ్ణం పెట్టాడు.

"ఆల్ ద బెస్ట్" అని తేలిగ్గా అనేశాను.

'వీడికెక్కడ వస్తుందిలే' అనే తేలిక భావంతో 'మహా మహా కోచింగ్ తీసుకుంటున్న వాళ్లకే అది గగన కుసుమం. ఈ రిక్షావాలా కొడుక్కి ఎక్కడ వస్తుంది?' అనుకున్నాను.

నా పిల్లల అపజయాన్ని చవిచూశాక, వీడూ పరీక్ష రాశాడనే అజ నాకు ఇప్పుడొచ్చింది.

"అవునూ! నువ్వూ ఎంట్రెన్స్ రాశావు కదా! రిజల్ట్ చూసుకున్నావా?" అని అడిగాను. పొద్దుటి నుండీ వీడు మాతోనే ఉన్నాడని తెలిసి కూడా.

"లేదు సార్! కుదర్లేదు" అన్నాడు.

"ఎందుకని?" అని మళ్లీ ప్రశ్న. ఎందుకో తెలీక కాదు, ఇంతకాలం పెంచుకున్న అహంకారం, మదంతో అడిగిన ప్రశ్న అది.

"ఎంతో కష్టపడి రాసిన పాపా, బాబుకే రాలేదు. నేనెంత సర్" అన్నాడు వాడు.

అవునన్నట్టు తల పంకించాను.

"సరే ఇంటికెళ్లు" అన్నవాడినే "పోనీ నీ నెంబర్ చెప్పు రిజల్ట్ చూద్దాం" అన్నాను.

వాడు నెంబర్ చెప్పాడు.

ఒక్క క్షణం వేచి ఉన్న తర్వాత -

నా ఆశ్చర్యానికీ, నా మదానికీ సమాధానం అన్నట్టు-

వాడికి ఆలిండియా పదో ర్యాంక్ వచ్చింది.

వాడు చిరునవ్వుతో నా కాళ్లకి మొక్కాడు "అయ్యా! ఇది మీ ఆశీర్వాద బలం" అంటూ.

ర్యాంకింగ్‌లో ఏమయినా మిస్టేక్ జరిగిందేమో అని మళ్లీ నా అహంకారం నన్ను ప్రశ్నించింది.

'బుద్ధి లేకపోతే సరి. వాడి సక్సెస్ ఎందుకు యాక్సెప్ట్ చెయ్యవని' వివేకం గడ్డి పెట్టింది.

'ఫలభరితమైన చెట్లు వంగి ఉంటాయనడానికి' నిదర్శనంగా గోడ కింద పిల్లోడు వినయంగా నా కాళ్ల దగ్గరే ఉన్నాడు. వాడిని పైకి లేవనెత్తాను.

"ఎలా ప్రిపేర్ అయ్యావురా?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"అయ్యా! మా నాన్న ఎప్పుడూ మీరు జీవితంలో ఎలా పైకి వచ్చారో చెపుతుంటాడు. మీ కృషి గురించీ, పట్టుదల గురించీ, కమిట్‌మెంట్ గురించీ.. దాంతో మీరే నాకు రోల్‌మోడల్ అయ్యారు. పదో తరగతి నుండీ ఎప్పుడు ఏ పరీక్ష వచ్చినా, మీకు తెలీకుండా మీ చేతుల మీదగానే పరీక్ష ఫీజ్ సంపాదించేవాడిని. సంవత్సరానికొకసారి ఆంజనేయస్వామి వేషం వేసుకొని ఒక అబ్బాయి మీ ఇంటికొచ్చేవాడు. వాడు పాటలు బాగా పాడుతున్నాడని మీరు అంటుంటారు. అది ఎవరో కాదు సార్ నేనే. ఎప్పుడు పరీక్షల ఫీజ్ కట్టాలన్నా ఆ వేషం కట్టి మీ ఇంటికి మాత్రమే వచ్చేవాడిని. చేతికి ఎముక లేనట్టుగా మీరు డబ్బులిచ్చేవారు. ఆ డబ్బులతో పరీక్ష ఫీజ్ కడితే మంచి సక్సెస్ వస్తుందని నా సెంటిమెంట్. ఈ తడవ కూడా మీరిచ్చిన డబ్బులతోనే ఫీజ్ కట్టి, అమ్మాయిగారి స్టడీ మెటీరియల్ జిరాక్స్ తీసుకొని అవే చదివాను సర్. మీ గేట్ లైట్ వెలుగు మా గుడిసెలోకి బాగా కనిపిస్తుంది. ఆ వెలుగులో చదువుకున్న నా ప్రతి సక్సెస్‌కీ మీరు పెట్టిన బిక్షే సర్" అన్నాడు.

వాడి ముఖంలో నిజాయితీ ఉంది.

నా పిల్లల చదువులకీ నా చేతులతోనే డబ్బులిచ్చాను. వాళ్లు చెయ్యలేనిది 'గోడకింద పిల్లోడు' చేసి చూపించాడు.

"నీ అసలు పేరేమిట్రా?" అని అడిగాను.

వాడు నా పేరు చెప్పాడు.

"నా పేరు కాదు, నీ పేరు అడుగుతున్నాను" అన్నాను.

"మా అయ్య నాకు మీ పేరే పెట్టాడు సర్" అన్నాడు.

నా వీపు మీద చరిచినట్లయింది.

మనిషి నిచ్చెనలో పై మెట్టుకెదుగుతూ, క్రింది మెట్టును మర్చిపోతాడు. నేనూ అలాంటి అర్భకుడ్నే అనిపించింది ఆ క్షణం. వీడి తండ్రి నేను ఎవరూ కానప్పుడు, నా కోసం చర్మం వల్చి చెప్పులు కుట్టాడు కానీ నేను వీళ్లకి ప్రతిఫలం ఏమిచ్చాను? నాకు అరిష్టం అనుకున్న నా వంకర స్థలాన్ని తప్పించి.

గోడకింది పిల్లాడ్ని నా పేరుతో పిల్చి, కంగ్రాట్స్ చెప్పి, వాడి సక్సెస్‌కి మనస్ఫూర్తిగా అభినందించాను.

ఈ సంఘటన నాకొక పెద్ద కనువిప్పు.



## కోలీవుడ్‌లో కత్రినా

ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్న కత్రినా కైఫ్ కెరీర్ ఆరంభంలో తెలుగులో నటించింది. కానీ ప్రస్తుతం అంత తీరిక లేని కత్రినా తాజాగా ఓ తమిళ చిత్రంలో నటించవచ్చునే వార్తలు వినిపిస్తున్నాయి. సూర్య హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో తయారుకానున్న తమిళ చిత్రంలో కత్రినా కైఫ్ హీరోయిన్‌గా నటించడానికి ఓకే అందని సమాచారం. 'గజినీ' తర్వాత మురుగదాస్-సూర్య కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కాబట్టి ఇందులో కత్రినా పాత్ర కూడా వెరయిటీగా ఊహించవచ్చు.